క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మదనపల్లె : పట్టణంలోని పీపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహ వేడుకలో నూతన వధూవరులు శ్రీహర్షరెడ్డి, ఐ.జ్యోత్స్నలను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌లు ఆశీర్వదించారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన జయనాథ్‌రెడ్డి కుటుంబ వివాహ వేడుకకు గురువారం రాత్రి మాజీ మంత్రి పెద్దిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, ఎస్.వెంకటరెడ్డియాదవ్, దండురవిచంద్రారెడ్డి, పాల్‌చంద్రశేఖర్, ఎస్.ఏ.కరీముల్లా, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



జింకా వెంకటాచలపతి



దండు కరుణాకర్‌రెడ్డి



కే.శ్రీనివాసులురెడ్డి



కేశవరెడ్డి

మదనపల్లె : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి మండల అధ్యక్షులను నియమించారు. గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన నియామక ఉత్తర్వుల్లో... మదనపల్లె మున్సిపాలిటీకి...మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతిని, మదనపల్లె మండలానికి బొమ్మనచెరువు సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డిని, నిమ్మనపల్లె మండలానికి కే.శ్రీనివాసులురెడ్డి, రామసముద్రం మండలానికి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డిని అధ్యక్షుడిగా ప్రకటించారు.

పారదర్శకంగా భూముల రీసర్వే



భూముల రీసర్వే పరిశీలిస్తున్న తహశీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : మండలంలో భూముల రీసర్వే పారదర్శకంగా చేపడుతున్న తహసీల్దార్ ఎం.భీమేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వేపులబైలు పంచాయతీలో మూడో విడత భూముల రీసర్వే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో 1404 సర్వే నెంబర్లు ఉన్నాయని గ్రామంలో 3706 ఎకరాలు భూమి ఉందని, ఇప్పటి వరకు 95 ఎకరాలు మాత్రమే భూముల రీ సర్వే చేశారని, మిగిలినవి త్వరగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రమణ్యం, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ఆదాయానికి మలుపు



బహుమతులు అందజేస్తున్న డీఎం పి. నిర్మల

పీలేరురూరల్ : ఆర్టీసీలో ఇంధన పొదుపు ఆదాయానికి మలుపు లాంటిదని డీఎం పి.నిర్మల అన్నారు. గురువారం స్థానిక గ్యారేజీలో జనవరి మాసంలో అత్యధిక ఇంధన పొదుపు సాధించిన ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో అత్యధిక ఇంధన పొదుపు సాధించిన వి. యర్రయ్యకు ప్రథమ బహుమతి, ఎం. మహేశ్వర్‌కు ద్వితీయ బహుమతి అందజేశారు. కండెక్టర్లు ఎస్. మస్తాన్, హరిబాబు, పురుషోత్తంలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి, బస్స్టేషన్ మేనేజర్ బాబునాయక్, యూనియన్ నాయకులు సి.వి. రమణ, బి.ఆర్. నాయక్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపలచెరువు వేలం ద్వారా రూ.1.63 లక్షల ఆదాయం

నిమ్మనపల్లె : చేపల చెరువుల వేలం ద్వారా రాచవేటివారిపల్లె పంచాయతీకి రూ.1.63 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓపీఆర్డీ చలపతిరావు తెలిపారు. గురువారం స్థానిక సచివాలయంలో సర్పంచు సుబ్రమణ్యం అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి మారెప్ప ఆధ్వర్యంలో పంచాయతీలోని 14 చెరువులకు వేలంపాటలు నిర్వహించగా డిపాజిట్‌దారులు 12 చెరువులకు వేలంపాట పాడారు. వీరభద్రుడి చెరువు, పెద్దకుంటలకు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలం పాట జరగలేదు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలపై చిత్తశుద్ధి ఏదీ ?

- వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో ఉర్దూ పాఠశాలలకు తెలుగు, తెలుగు పాఠశాలలకు ఉర్దూ టీచర్లు
- పరీక్షలు సమీపిస్తున్నా అందని స్టడీ మెటీరియల్
- ఆందోళనలో ఉర్దూ విద్యార్థులు



ఉర్దూ ఉన్నత పాఠశాల, మదనపల్లె

మదనపల్లె సిటీ : ఉర్దూ రాష్ట్ర ద్వితీయ అధికార భాష. గత ప్రభుత్వంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉర్దూకు 13 జిల్లాలోనూ ద్వితీయ అధికార భాష హోదా కల్పించి పెద్ద పీట వేశారు. పాఠశాల విద్యలో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టినా, ఎక్కడా ఉర్దూ, మైనర్ మీడియా పాఠశాలల జోలికి వెళ్లలేదు. ఉర్దూ పాఠశాలలను అలాగే కొనసాగించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్, మెర్జింగ్ పేరుతో ఉర్దూ పాఠశాలలు మూతపడేలా చేస్తున్నాయి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా తయారైంది ఉర్దూ టీచర్ల సర్దుబాటు, మెర్జింగ్‌ప్రక్రియ. ప్రభుత్వం తీసుకువచ్చిన అసంబద్ధ జీఓలతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యాశాఖ తలపెట్టిన తాత్కాలిక సర్దుబాటు, మెర్జింగ్ నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేసినా ఫలితం శూన్యం. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించమని ప్రభుత్వం ఆదేశించినా వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేశారు. వీటితో ఉర్దూ మీడియం పాఠశాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా ఉర్దూ పాఠశాలల్లోని ఖాళీలను ఉర్దూ మీడియంలో చదువుకున్నవారితో భర్తీ చేయాల్సివుండగా ఉర్దూ మాట్లాడలేని, చదవలేని వారిని తీసుకొచ్చి సర్దుబాటు చేశారు. మదనపల్లె అర్బన్ పరిధిలోని మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సైన్సు టీచర్‌గా పని చేస్తున్న ఓ ఉపాధ్యాయురాలిని ఇదే అర్బన్ పరిధిలోని బాపూజీ మున్సిపల్ తెలుగు మాధ్యమ పాఠశాలకు సర్దుబాటు చేశారు. అలాగే మరో మండలంలోని తెలుగు మీడియం పాఠశాలలో గణిత టీచర్‌గా పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడిని మదనపల్లెలోని బాలాజీనగర్ ఉర్దూ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారు. పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలం తరిగొండ ఉర్దూ స్కూల్‌లో సోషియల్, ఇంగ్లీషు, ఫిజిక్స్ సబ్జెక్టులలో తెలుగు మీడియం పాఠశాలలకు ఉపాధ్యాయులుగా నియమించారు. ఈ ఏడాది ప్రభుత్వం ఉర్దూ పాఠశాలలకు పంపిణీ చేసిన వర్క్ బుక్‌లన్నీ ఉర్దూ మీడియంలో ఉన్నాయి. వీటిని తెలుగు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధించగలరు? దీంతో ఉర్దూ పాఠశాలల్లోని విద్యార్థులు తెలుగులో చెప్పే పాఠాలు అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

పరీక్షలు సమీపిస్తున్నా స్టడీ మెటీరియల్ ఏదీ ?

ఉర్దూ మీడియం చదివే విద్యార్థుల కోసం మైనార్టీ మంత్రిత్వశాఖ సెంటర్‌ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్(సీఇడీఎం) ఆధ్వర్యంలో ఏటా పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ తయారు చేసి పంపిణీ చేసేది. జగనన్న ప్రభుత్వంలో క్రమం తప్పకుండా సకాలంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరమే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందలేదు. మరో నెలరోజులోల పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఉర్దూ టీచర్లనే నియమించాలి



ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ అర్హత కలిగిన టీచర్లనే నియమించాలి. వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో, మెర్జింగ్ పేరుతో ఉర్దూ టీచర్లకు తెలుగులో, తెలుగు టీచర్లలకు ఉర్దూ పాఠశాలల్లో నియమించరాదు. అసంబద్ధ సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయాలి. ఏ ఒక్క ఉర్దూ పాఠశాలను కూడా డ్రీగ్రేడ్ లేదా మెర్జింగ్ చేయరాదు.

– నిస్సార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మదనపల్లె

మెటీరియల్ వెంటనే ఇవ్వాలి



పదో తరగతి విద్యార్థుల కోసం సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ మైనార్టీస్ సంస్థ ప్రచురింపజేసే స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేయాలి. లేని పక్షంలో విద్యార్థులు నష్టపోతారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ఎస్.అబ్దుల్ కలీమ్, మైనార్టీ నాయకుడు

హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలకడ : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కుంటి సాకులతో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోన పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా ఏ పథకం ఆగకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి నవరత్నాలను అందించారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ అంటూ హామీలు చేయడం లేదన్నారు. అర్హత కలిగిన పింఛన్ దారులు కూడా తనిఖీల పేరుతో తొలగిస్తారని ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు పెరుగుతున్నా హామీలు అమలు కాకపోవడం లో ఆంతర్యం ఏమిటో ఎవ్వరికి అర్థం కాదన్నారు. ధరల తగ్గింపు ఎక్కడైనా జరిగిందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నల్లారి తిమ్మారెడ్డి, బరకం రవికుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు జల్లా క్రిష్ణకుమారి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, గడిబండ సర్పంచ్ సుమిత, వెంకటప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోఆర్డినేటర్ కుమార్‌నాయుడు, ఉదయ్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, సురేంద్రరెడ్డి, పి.ఎస్.వెంకట్రమణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరినాధరెడ్డి, కుమార్‌రెడ్డి, మోహన్‌రాజ, బాబురెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేయాలి

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



నిసార్‌అహ్మద్‌ను సత్కరిస్తున్న యువజన విభాగం అధ్యక్షుడు డి.హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పిలుపు ఇచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు డి.హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షులు కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువతో సన్మానించారు. తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...టీడీపీ కూటమిప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలుచేయకుండా పేద ప్రజలకు మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు చేసే మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు పార్టీ చేసే ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలన్నారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సరైన గుర్తింపు ఉంటుందని, పదవులు పొందిన ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్‌ఐ.రమణారెడ్డి, నరిబాబాయ్, కోటూరిఈశ్వర్, ప్రసాద్ బాబు, మహమ్మద్ యూనిస్, మునిశేఖర్, నాగరాజు, నరేంద్ర, చరణ్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి

జేసీ ఆదర్శ రాజేంద్రన్



సబ్‌కలెక్టరేట్‌లో భూసమస్యలపై విచారణ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లె : రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకు డివిజన్ కేంద్రాల వారీగా విచారణ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి సబ్ కలెక్టరేట్‌లో వెబ్‌ల్యాండ్, 22ఏ సమస్యలకు సంబంధించి విచారణ చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో వెబ్‌ల్యాండ్ సమస్యలపై నిమ్మనపల్లెలో 4, మదనపల్లెలో 6, వాల్మీకిపురం 7, రామసముద్రం 4, బి.కొత్తకోట 2, కురబలకోట మండలంలో 3, పెద్దతిప్పసముద్రంలో 1 పెండింగ్ ఫైళ్లపై విచారణ చేశారు. 22ఏ, ఫ్రీహోల్డ్, నిషేధిత భూములకు సంబంధించిన దరఖాస్తులపై సంబంధిత వీఆర్వోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. భూసమస్యలపై బాధితులు జిల్లా కేంద్రానికి రావాలంటే వ్యయప్రయాసలతో కూడుకొన్నది కావడంతో, డివిజన్ కేంద్రాలకు వచ్చి రికార్డులు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మల్లయ్యకొండను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని ఈఓ మునిరాజకు సూచించారు. మల్లయ్యకొండ కింద జరుగుతున్న గుడుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్నదాన ట్రస్టు ద్వారా నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లపై నాయకులతో అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు క్రిష్ణారెడ్డి, మెడికల్‌షాపు నారాయణరెడ్డి, రామమూర్తి, కిషోర్‌రెడ్డి,జయనారాయణరెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు కలిసికట్టుగా పోరాటం



మాట్లాడుతున్న ఆటో ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాఫర్

మదనపల్లె : పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు కలిసికట్టుగా పోరాటం చేద్దామని మదనపల్లె ఆటో ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాఫర్ అన్నారు. గురువారం ఆటో ఎలక్ట్రీషియన్స్ యూనియన్ సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కమిటీ సభ్యుల ఎన్నికల, సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జాఫర్ మాట్లాడుతూ...రాష్ట్రంలోనే ఆటోమొబైల్ రంగంలో మదనపల్లె రెండో స్థానంలో నిలిచిందన్నారు. అయితే ఇంత వరకు ఆటోనగర్ లేకపోవడంతో వేలాదిరూపాయలు బాడుగలు కట్టలేక అనేకమంది యజమానులు కూలీలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు విధుల్లో ప్రమాదవశాత్తు గాయపడి అంగవైకల్యం పొందినా, మృతిచెందినా కుటుంబాలు వీధినపడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలు మంజూరుచేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కలందర్, కోశాధికారి వాసు, ఉపాధ్యక్షులు మస్తాన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

మదనపల్లె సిటీ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందించాలని మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు గురువారం వినతిపత్రం అందజేశారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఉదయం 8 నుంచి రాత్రి 9 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున వారికి సాయంత్రం పూట మున్సిపల్‌శాఖ ద్వారా అల్పాహారం ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎంలు రాజేంద్రప్రసాద్, పురం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి



లక్ష్మీ నరసింహస్వామి అవతారంలో స్వామివారు

రామసముద్రం : శ్రీ లక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు లక్ష్మీ నరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్ భట్టర్‌లు భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి తోమాల సేవ నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ నిర్వహించారు.

పనుల నాణ్యతలో రాజీపడొద్దు



నిబంధనలకు విరుద్ధంగా సమావేశంలో కూర్చున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎంపీపీ రెడ్డెమ్మ

- సర్వసభ్యసమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు
- జనరల్‌బాడీ మీటింగ్‌లో టీడీపీ నాయకుల జోరు

మదనపల్లె : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడే ప్రసక్తి లేదని, పదికాలాల పాటు మన్నేలా పనులు జరగాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు తమ శాఖలవారీగా జరుగుతున్న అభివృద్ధిని, ప్రగతిని వివరించారు. ప్రజల కోసం ఆయా శాఖలు అమలుచేస్తున్న పథకాలను తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి రెవెన్యూ, ఐసీడీయస్, గ్రౌండ్‌వాటర్‌కు సంబంధించిన అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంపీడీఓను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పల్లెల్లో ప్రజలు దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారని, పారిశుధ్య నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, సమస్యలు లేకుండా చూడాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలపై నివేదిక అందిస్తే శాశ్వత భవనాల కేటాయింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, వైస్ ఎంపీపీలు నందినితాజ్, డిష్ రమణ, వెలుగు చంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సర్వసభ్యసమావేశంలో తమ్ముళ్ల జోరు :

మండల సర్వసభ్య సమావేశానికి నిబంధనల ప్రకారం మండలస్థాయి ప్రభుత్వ అధికారులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాల్సి ఉంటుంది. అయితే గురువారం జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో ఎమ్మెల్యే అనుచరులు, టీడీపీ నాయకులు హంగామా చేశారు. సర్వసభ్య సమావేశంలో పాల్గొనే అర్హత లేనప్పటికీ, దర్జాగా కూర్చుని దర్పం ప్రదర్శించారు. సంబంధం లేని వ్యక్తులు సమావేశంలో పాల్గొన్నప్పటికీ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అడ్డుచెప్పకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముత్యపు పందిరిపై శ్రీనివాసుడు



ముత్యపు పందిరిపై స్వామివారి ఊరేగింపు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు,అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్,క్రిష్ణమూర్తి గురువారం స్వామి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం ముత్యపు పందిరి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. రాత్రి సింహవాహనంపై స్వామికివారిని ఊరేగింపు నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, కళాకారులుచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో భక్తులను అలరింపజేశారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న రీజనల్ ఫైర్ అధికారి భూపాల్‌రెడ్డి

ములకలచెరువు : స్థానిక ఫైర్ స్టేషన్‌ను కర్నూల్ జోన్ రీజనల్ ఫైర్ అధికారి యం. భూపాల్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, ఫైర్ ఇంజిన్ పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫైర్ స్టేషన్ కోసం కొత్త భవనం మంజూరైందన్నారు. ఇందుకు రూ.2.25 కోట్లు నిధులు సైతం మంజూరయ్యాయన్నారు. బురకాయలకోట సమీపంలో తుమ్మణగుట్ట టోల్‌ప్లాజా వద్ద స్థలం మంజూరైనట్లు ఆయన తెలిపారు. త్వరలోనే భవనం పనులు ప్రారంభమవుతాయన్నారు. వేసవి కాలం వస్తుండడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఫైర్ అధికారి నరసింహులు, సిబ్బంది ఉన్నారు.

బీఎస్‌పీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్

ములకలచెరువు : తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీఎస్‌పీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండెల గౌతమ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు మల్లికార్జున అన్నారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో ఆరు మండలాలల అధ్యక్షులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధి బీఎస్‌పీతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గంలో పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యోగంధర్, బాలాజీ, సోముశేఖర్, నరసింహులు, శ్రీనాథ్, గంగాధర్ ఉన్నారు.

అన్నదానం

మదనపల్లె సిటీ : స్థానిక బసినికొండ వద్దనున్న సాయి చైతన్య అనాథశ్రమంలో గురువారం లయన్స్ అభయ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించినట్లు లయన్స్ అభయ కె.సుధాకర్‌రెడ్డి తెలిపారు. అనాథశ్రమం నిర్వహిస్తున్న నిర్వాహకులు పద్మనాభరెడ్డిని అభినందించారు.

పీటీఎం ఎస్ఐగా హరిహర ప్రసాద్

పెద్దతిప్పసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలోనే పెద్దతిప్పసముద్రం మండలానికి నలుగురు ఎస్ఐలు బదిలీ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది ఆగస్టు 10న ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రవీంద్రబాబు లక్కిరెడ్డిపల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నరసింహుడు ఎస్ఐగా విధుల్లో చేరిన ఐదు నెలల వ్యవధిలోనే ములకలచెరువు మండలానికి బదిలీపై వెళ్ళారు. అనంతరం ఇక్కడ ఎస్ఐగా నియమితులైన రవికుమార్ విధుల్లోకి చేరిన రెండు నెలల కాలంలోనే రామసముద్రం మండలానికి బదిలీ కావడం గమనార్హం. తాజాగా మదనపల్లిలో ఎస్ఐగా పని చేస్తున్న హరిహర ప్రసాద్‌ను పీటీఎంకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావడంతో ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు.

పెద్దేరు ప్రాజెక్టు కాలువల అభివృద్ధి పనుల పరిశీలన

తంబళ్లపల్లె: మండలంలోని కొటాల పంచాయతీ పెద్దేరు ప్రాజెక్టు సాగునీటి కాలువల ఆధునికీకరణ పనులను ఇరిగేషన్ ఎస్ఈవెంకటరమణరాజు పరిశీలించారు. గురువారం ఆయన ఈఈ సురేష్‌బాబు, ఏఈ సతీష్‌కుమార్‌తో కలసి పెద్దేరు ప్రాజెక్టు కలువ గేట్లు, కోటర్స్, కాలువల అభివృద్ధి పనులు, ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన పార్కు, రోడ్లను పరిశీలించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు, చేపడు తున్న కాలువల ఆధునికీకరణ పనుల గురించి ఏఈని అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో వేగవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టులో రోడ్ల దుస్థితి, గార్డెన్ మరమ్మతులు, పర్యాటకులకు బోటింగ్ సౌకర్యం తదితర విషయాలను ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్ ఎస్ఈకి వివరించారు.